క్లుప్తంగా

వాహనాల తనిఖీ



మానకొండూర్: మండల కేంద్రంలోని తూర్పు దర్వాజ చౌరస్తాలో మంగళవారం సీఐ సదన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనాలను, అనుమతి లేని ఇసుక ట్రాక్టర్లను పరిశీలించారు. మైనర్లు, లైసెన్స్ లేనివారు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్యాండ్ ట్యాక్సీ లేని రోజు ఇసుక ట్రాక్టర్లను నడిపిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

దర్గాలో గంధలేపనం



జమ్మికుంట: మడిపల్లి ఉమర్‌షావలి దర్గాలో ఉర్సు ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి గంధలేపనం(సంథాల్ షరీఫ్) ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ మహమూద్, భక్తులు గోదావరిఖని యైటింక్లయిన్ కాలనీ అల్లూరు దర్గా నుంచి గంధలేపనం తీసుకువచ్చారు. నాగపూర్ నుంచి వచ్చిన చాదర్లు, పూలు సమాధిపై అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం వారికి అన్నదానం చేపట్టారు. మత గురువులు సయ్యద్ నయీం బాబా, సయ్యద్ షమీంబాబా, నిర్వాహకులు మహమ్మద్ ఇంతియాజ్, మహమ్మద్ రియాజ్, మహమ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ కన్వీనర్ల నియామకం



జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ ఉమ్మడి జిల్లా బాధ్యుడు గూడూరి స్వామిరెడ్డి, ప్రచార కార్యదర్శి తులసి లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో మంగళవారం సభ్యుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్‌గా రావుల రాజేశం, జమ్మికుంట మండల కన్వీనర్‌గా పోరండ్ల శ్రీనివాస్, కో–కన్వీనర్‌గా చందా మహేందర్, ఇల్లందకుంట కన్వీనర్‌గా మూల శ్రీనివాస్‌లను నియమించి, నియామక పత్రాలు అందజేశారు.

అన్నదానం

రామడుగు: గోపాల్‌రావుపేటలో గోపాల్‌రావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా మంగళవారం పారిశుధ్య కార్మికులు, హమాలీలు, కూలీలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కర్ర ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కర్ర రాజిరెడ్డి, కర్ర శ్యాంసుందర్‌రెడ్డి, మచ్చ గంగయ్య, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ సిబ్బంది అరెస్టు




శంకరపట్నం: అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా శంకరపట్నం మండలంలోని జీపీ సిబ్బందిని మంగళవారం తెల్లవారుజామున కేశవపట్నం పోలీసులు అరెస్టు చేశారు. మల్లేశం, సారయ్యతో సహా 8 మందిని సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లోనే ఉంచి, తర్వాత వదిలి పెట్టారు.

వృక్ష సంపద పెంచుకోవాలి

సైదాపూర్: మానవాళి మనుగడకు వృక్ష సంపద పెంచుకోవాలని జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు అన్నారు. సైదాపూర్ మండలంలోని బొమ్మకల్‌లో వెన్కెపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటారు. జిల్లా సహకార సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, వెన్కెపల్లి సహకార సంఘం చైర్మన్ తిరుపతిరెడ్డి, సీఈవో శ్రీధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్కూల్‌కు ఫ్యాన్లు అందజేత



ఫ్యాన్లు అందిస్తున్న దాతలు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ జిల్లా అడ్మినిస్ట్రేటర్ ఎంఎల్ఎన్.రెడ్డి మంగళవారం రూ.10 వేల విలువైన 6 ఫ్యాన్లను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మహేశుని మల్లేశం, మోర భద్రేశం, మామిడి రాజేశ్, తొడుపునూరి సత్యనారాయణ, రఘుకిశోర్, లక్ష్మీకాంతం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గర్షకుర్తి చేనేత కార్మికుల ధర్నా





ధర్నా చేస్తున్న చేనేత కార్మికులు, మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర: తమకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ గంగాధర మండలంలోని గర్షకుర్తికి చెందిన చేనేత కార్మికులు మంగళవారం కరీంనగర్–జగిత్యాల జాతీయ రహదారిలోని కురిక్యాల వద్ద ధర్నా చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరల తయారీ ద్వారా పని దొరికిందని, ప్రస్తుతం పని లేక ఇల్లు గడవడం లేదన్నారు. గ్రామంలో 6 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. ప్రధాన రహదారికి ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. బాధితులతో మాట్లాడి, ఆందోళన విరమింపజేసారు. చేనేత కార్మికుల సంఘం నాయకులు అలువాల విఠోభ, అన్నల్‌దాస్ శ్రీనివాస్, దూస లచ్చయ్య, గాలి లక్ష్మీరాజం, చిందం సత్యనారాయణ, శ్రీనివాస్, గడ్డం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

చేనేత, పవర్‌లూం కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. ఉపాధి కల్పించాలంటూ ధర్నా చేపట్టిన వారికి ఆయన మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ చీరల ఉత్పత్తికి అవకాశమిచ్చి, కార్మికులకు చేతినిండా పని కల్పించామన్నారు. ప్రస్తుతం పనిలేక వారు పస్తులుండే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

జమ్మికుంట: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట మండల అధ్యక్షుడు వీరంనేని పర్శరాంరావు అన్నారు. జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులను అరిగోస పెట్టిందని, ఇప్పు డు ఆ పార్టీ నేతలే నీతులు చెబుతున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీలనూ తమ ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు లేనిపోని ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు.

‘రుణమాఫీతో రైతుల కళ్లల్లో ఆనందం’

చిగురుమామిడి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రూ.2 లక్షల రుణమాఫీతో రైతుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని కాంగ్రెస్ చిగురుమామిడి మండల శాఖ అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను కూడా ఒకటి తర్వాత ఒకటి అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీని ఏడాది పొడవునా సాగదీసిందని, అర్హత కల్గిన రైతులకు మాఫీ వర్తించలేదని ఆరోపించారు. ఇప్పటివరకు రెండు విడతలు పూర్తయ్యాయని, మరో 15 రోజుల్లో మూడో విడత రుణమాఫీ చేసేందుకు సీఎం కసరత్తు చేస్తున్నారని పేర్కొన్నారు.

1,458 మంది రైతులకు..

చిగురుమామిడి మండలంలోని 17 గ్రామాలకు చెందిన 1,458 మంది రైతులకు రూ.1.50 లక్షల రుణమాఫీ జరిగింది. మంగళవారం మధ్యాహ్నం సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేసిన జాబితాలో మండల రైతుల పేర్లు ఉన్నాయి. రెండు విడతల్లో కలిపి 4,015 మందికి లబ్ధి చేకూరినట్లు మండల వ్యవసాయాధికారి కె.రంజిత్‌కుమార్ తెలిపారు.

సీఎం ప్రసంగం వీక్షించిన రైతులు



రామడుగు రైతు వేదికలో సీఎం ప్రసంగం వీక్షిస్తున్న రైతులు, అధికారులు

మానకొండూర్: మండల కేంద్రంలోని రైతు వేదికలో క్లస్టర్ రైతులు మంగళవారం రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. దశలవారీగా మాఫీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవో సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం రైతువేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెండో విడత రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు వీక్షించారు. రెండో విడతలో రూ.1.50 లక్షల వరకు మాఫీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బసవయ్య, హిసామొద్దీన్, ఏఈవోలు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రెండో విడత రైతు రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రామడుగు మండల రైతులు వీక్షించారు. మండలంలోని 23 గ్రామాల్లో 1,369 మందికి రూ.1.50 లక్షల వరకు మాఫీ అయినట్లు ఏవో యాస్మిన్ తెలిపారు. కార్యక్రమంలో కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మన్ మురళీకృష్ణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజగోపాల్‌గౌడ్, ఎంపీడీవో రాజేశ్వరి, ఏఈవోలు పాల్గొన్నారు.

సమాజంలో అసమానతలు దూరం కావాలి





కొండయ్యపల్లిలో సమావేశమైన అధికారులు, నాయకులు, లక్ష్మీపూర్‌లో..

చొప్పదండి: సమాజంలో అసమానతలు దూరం కావాలని, అప్పుడే సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని మాజీ ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. చాకుంట గ్రామంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. దళితులు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగాలని, వారి భూసమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంగాధర: కొండయ్యపల్లి పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ వినయ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో కుల వివక్ష ఉండకూడదన్నారు. గ్రామ సమస్యలపై చర్చించారు. నాయకులు చిలుముల రాజయ్య, గంగాధర రవి, బెజ్జంకి నరేశ్, ద్యావ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: అగ్రవర్ణాల వారు కులవివక్ష చూపుతున్నారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు అంబేడ్కర్ సంఘం కమ్యూనిటీ భవనం ఆవరణలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో అగ్రవర్ణాల వారు దళిత కాలనీకి వస్తే కుర్చీ వేసి, కూర్చోబెడతామని, వారి ఇంటికి మేము వెళ్తే కూర్చోమని చెప్పడం లేదన్నారు. ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ ఆఫీస్‌కు వెళ్తే పనులు చేయడం లేదని అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు అంతడ్పుల సతీశ్ పేర్కొన్నారు. తన వద్దకు వచ్చిన దరఖాస్తులు పరిశీలించి, సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు తహసీల్దార్ అనుపమ తెలిపారు. ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎస్సై లక్ష్మారెడ్డి, ఎంపీవో బషీరొద్దీన్, న్యాయవాది శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మానకొండూర్ రూరల్: మండలంలోని లక్ష్మీపూర్‌లో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి స్పెషల్ ఆఫీసర్ సుష్మిత, ఆర్ఐ ప్రవీణ్ హాజరై, అంటరానితనంపై అవగాహన కల్పించారు. ఎస్సీ సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి

రామడుగు: పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని ఆ శాఖ నార్త్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ కోరారు. రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం పోస్టల్ శాఖ సంక్షేమ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆర్డీ, ఎస్బీ, ఎస్ఎస్‌వై, టీడీ, ఎఫ్‌డీ, ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐ పథకాల గురించి వివరించారు. గ్రామానికి చెందిన క్లెం పురుషోత్తం ప్రమాదవశాత్తు మృతిచెందగా ఆయన భార్య రమకు రూ.5 లక్షల బీమా క్లెయిమ్ అందజేశారు. కార్యక్రమంలో మొయిల్ ఓవర్ సీర్ మల్లేశం, కార్యదర్శి శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు ఎడవెల్లి కరుణశ్రీ, బీపీఎం అజయ్, ఏబీపీఎం శేఖర్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

మౌన దీక్షలో పెన్షనర్స్ నాయకులు



నిరసన తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ ఆల్ పెన్షనర్స్ జేఏసీ మంగళవారం నిర్వహించిన మౌన దీక్షకు పెన్షనర్ల సంఘం జమ్మికుంట మండల అధ్యక్షుడు గరిగె చంద్రయ్య ఆధ్వర్యంలో నాయకులు హాజరయ్యారు. పెండింగ్ డీఏ ఇవ్వాలని, ఐఆర్ 20 శాతం పెంచాలని, పీఆర్సీ ప్రకటించి, జూలై నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల ఆరోగ్య రక్షణకు జిల్లాకు రెండు వెల్‌నెస్ సెంటర్లు, హైదరాబాద్‌లో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు చందు పట్ల జనార్దన్, అధ్యక్షుడు కట్ట నాగభూషణం చారి, ప్రధాన కార్యదర్శి గడ్డం అశోక్, ఉపాధ్యక్షుడు ఎనమనగండ్ల రామస్వామి, నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌కు సన్మానం



జమ్మికుంట: మండలంలోని వావిలాల పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రెడ్డి శంకర్‌రెడ్డి బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సనజవేరియా, సిబ్బంది మంగళవారం ఆయనను సత్కరించారు. శంకర్‌రెడ్డి విధుల్లో క్రమశిక్షణతో ఉండి, సేవలందించారని కొనియాడారు. 27 ఏళ్లుగా పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఇల్లందకుంట పీహెచ్‌సీ వైద్యులు తులసీదాస్, ఫర్హానుద్దీన్, కార్తీక్, మహోన్నత, హిమబిందు, సంధ్యారాణి, కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ హెల్త్ ఆఫీసర్ శ్రీమాన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రంగారెడ్డి, డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్‌గౌడ్, సూపర్‌వైజర్లు రత్నకుమారి, అరుణ, స్వరూప, సదానందం తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు అప్పగింత



నగదు అప్పగిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్: ఓ వ్యక్తి రూ.2 లక్షలు ఉన్న బ్యాగును ఈ నెల 24న బస్సులో మరిచిపోయాడు. ప్రయాణికులు దాన్ని హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. దీంతో ఆ బ్యాగు తనదేనంటూ హనుమకొండ జిల్లా బావుపేటకు చెందిన మేకల రాజయ్య మంగళవారం ఆధారాలతో ఠాణాకు వచ్చాడు. పోలీసులు పూర్తి వివరాలు తెలుసుకొని, ఏసీపీ శ్రీనివాస్‌జీ చేతులమీదుగా అతనికి అందించారు.

ఉచిత వైద్య శిబిరం

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు తులసీదాస్ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ స్కూల్లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వానాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సీతంపేట పల్లె ఆస్పత్రి వైద్యుడు కల్యాణ్, పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

పాఠశాలల్లో తిథి భోజనాలు



గోపాల్‌రావుపేట స్కూల్లో భోజనం చేస్తున్న విద్యార్థులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ అభియాన్‌లో భాగంగా మంగళవారం తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. శాలపల్లి మాజీ సర్పంచ్ కొడిగూటి శారద ఆధ్వర్యంలో విద్యార్థులకు యాపిల్, అరటిపండ్లు అందించారు. డీఈవో జనార్దన్‌రావు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మాచనపల్లి ప్రాథమిక పాఠశాల, పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం తిథి భోజన కార్యక్రమం చేపట్టారు. దాతలు పర్లపల్లి సునీత, నాగులపల్లి రమేశ్, వేల్పుల శ్రీకాంత్ విద్యార్థులకు లడ్డూలు, అరటి పండ్లు అందించారు. బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సదానందం, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుమాధవ్, ఉపాధ్యాయులున్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం తిథి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సహపంక్తి భోజనం చేశారు. వారికి స్థానిక నాయకుడు ఎడవెల్లి పాపిరెడ్డి మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంఈవో వేణుకుమార్, ఇన్‌చార్జి హెచ్‌ఎం మంజుశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పాల్

మానకొండూర్ రూరల్: పచ్చునూర్ గ్రామానికి చెందిన ఎల్కపల్లి పాల్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అనిల్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయనకు నియామక పత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు పాల్ కృతజ్ఞతలు తెలిపారు.

అర్చక కమిటీ నూతన కార్యవర్గం



శంకరపట్నం: అర్చక కమిటీ శంకరపట్నం మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం నియమించినట్లు గౌరవ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా వేమూరి రమేశ్ శర్మ, ఉపాధ్యక్షుడిగా చిమిరాల బాలాజీచార్యులు, ప్రధాన కార్యదర్శిగా బంగిమఠం నాగయ్య, సహాయ కార్యదర్శిగా సుమన్, కోశాధికారిగా శివప్రసాద్, ప్రచార కార్యదర్శిగా గంగాధర్‌లను నియమించామని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

హుజూరాబాద్‌రూరల్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి, 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పల్లె పల్లెలో దండోరా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం సింగాపూర్‌లో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యకుడు తునికి వసంత్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకుడు తిప్పారపు సంపత్, ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామి, మండల అధ్యక్షుడు రొంటాల రాజ్‌కుమార్, నాయకులు మారెపల్లి శ్రీనివాస్ మాదిగ, కలవల సంపత్, వీరస్వామి, మాజీ సర్పంచ్ రవీందర్ తదితరులున్నారు.

పరిశుభ్రత పాటించాలి

హుజూరాబాద్: పట్టణంలోని 3వ వార్డులో మంగళవారం డ్రై డే నిర్వహించారు. మున్సిపల్ అధికారులు స్థానిక ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించి, ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మురికి కాలువల్లో చెత్తాచెదారం వేయొద్దని, పారిశుధ్య సిబ్బందికి అందించాలన్నారు. కౌన్సిలర్ మక్కపల్లి కుమారస్వామి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ జరీనా, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, ఆశావర్కర్లు తదితరులున్నారు.

‘రుణమాఫీ జాబితాలో పేరు లేదు’



అధికారులకు దరఖాస్తు అందిస్తున్న రైతులు

శంకరపట్నం: రెండో విడత రుణమాఫీ జాబితాలో తమ పేరు లేదని కొంతమంది రైతులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ అధికారులకు దరఖాస్తు అందజేశారు. మొలంగూర్ ఇండియన్ బ్యాంక్‌లో రుణమాఫీ కాలేదని కన్నాపూర్, గుడాటిపల్లి, అర్కండ్ల, చింతలపల్లి అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు జాబితాను పరిశీలించి, రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు.

‘జ్యోతిష్మతి’లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



తిమ్మాపూర్: మెషిన్ లర్నింగ్, కంప్యూటర్ విజన్, ఐవోటీ, సాప్ ఏబీఏపీపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో మంగళవారం ప్రారంభమైంది. సాప్ ల్యాబ్స్ ఇండియా, టాస్క్ సీఎస్సార్ కార్యక్రమాల్లో భాగంగా కళాశాలలోని అన్ని విభాగాలకు చెందిన 32 మంది అధ్యాపకులకు శిక్షణనిస్తున్నారు. ఇది అధ్యాపకులు తమ బోధనా పద్ధతుల్లో సాంకేతికతను జోడించేందుకు ఉద్దేశించిందని కళాశాలల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. ఎంఎల్ ఏఐ నిపుణుడు పవన్‌సాయి, బెంగళూరులోని ఎడ్యునేట్ ఫౌండేషన్ ట్రైనర్ సుమిత్ సునీల్ పలు అంశాలపై అవగాహన కల్పించారన్నారు. కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ కేఎస్.రావు, డీన్ వైశాలి, సీఎస్ఈ హెచ్‌వోడీ జగదీశన్ తదితరులు పాల్గొన్నారు.

‘కళాకారులకు పీఆర్సీ హర్షణీయం’

జమ్మికుంట: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు పీఆర్సీ అమలు చేయడం హర్షణీయమని కళాకారుల సంక్షేమ సంఘం నాయకులు రామంచ భరత్, మారముల్ల ఆనందం, ఎండీ.రహీం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పాలనాపరమైన అడ్డంకులు ఎదురవడంతో పీఆర్సీ అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత జీవో విడుదల చేయడంతో కళాకారుల కుటుంబాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం రూ.24,514 వేతనం అందించగా, ప్రస్తుత సర్కారు పీఆర్సీ అమలు చేసి, రూ.31,868 ఖాతాలో జమ చేసిందన్నారు.

చలో ఢిల్లీ విజయవంతం చేయాలి

చొప్పదండి: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో ఆగస్టు 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ కోరారు. బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గుంటి స్వరూప ఆధ్వర్యంలో మంగళవారం చొప్పదండిలో చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు చిగుర్ల శ్రీనివాస్, నితిన్, శ్రీనివాస్, వేణుగోపాల్, నిట్టు శ్రీనివాస్ తదితరులున్నారు.

‘భగీరథ’ ఎయిర్‌వాల్వ్ లీకేజీ

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి–చిగురుమామిడి గ్రామాల మధ్య హుస్నాబాద్–కరీంనగర్ ఆర్‌అండ్‌బీ దారి పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్ లీకైంది. నీరంతా వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా ఎయిర్ వాల్వ్ లీకేజీని పరిశీలించి, మరమ్మతు చేయిస్తామని తెలిపారు.



– వృథాగా పోతున్న నీరు

వరదలో పడిపోయిన ద్విచక్రవాహనం



శంకరపట్నం: అర్కండ్ల లోలెవల్ బ్రిడ్జి పైనుంచి వెళ్తున్న నీటిలో మంగళవారం ఓ ద్విచక్రవాహనం పడిపోయింది. పెద్దపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు మోపెడ్‌పై హుజూరాబాద్ వెళ్తున్నారు. మార్గమధ్యలో అర్కండ్ల బ్రిడ్జి పైనుంచి నీరు వెళ్తుండటంతో వెనక కూర్చున్న వ్యక్తి వాహనం దిగాడు. మరో వ్యక్తి అలాగే ముందుకు వెళ్లడంతో వాహనం జారి, పడిపోయింది. బాధితుడు వరదలో కొట్టుకుపోతుండగా స్థానికులు బయటకు తీసుకువచ్చారు. వాహనాన్ని బ్రిడ్జి దాటించారు.